క్లుప్తంగా

ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకోవాలి

అన్నపురెడ్డిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ లక్ష ఆర్థిక సాయం కోసం అర్హులైన బీసీ కుల వృత్తిదారులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అన్నపూర్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 లోపు అర్హులైన లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

వరద బాధితులకు పరిహారం అందించాలి

అశ్వాపురం: జూలై 17న గోదావరి వరదలకు ఇళ్లు నీట మునిగిన బాధితులకు ఇప్పటివరకు పది వేల రూపాయల సాయం అందలేదని ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని ఎంపీపీ ముత్తినేని సుజాత డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడెంలో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ముత్తినేని సుజాత పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వరద బాధితులకు, వరదల్లో ప్రజలను ఒడ్డుకు చేర్చిన పడవ కూలీలను ప్రభుత్వం ఇప్పటి వరకు ఆదుకోలేదన్నారు. మండలంలో పోడు భూముల సర్వే పూర్తిగా జరగలేదని ఎంపీపీ సర్వసభ సమావేశంలో జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

చంద్రుగొండ ఎంపీఓగా వీరభద్రయ్య

చంద్రుగొండ: మండల పరిషత్ ఎంపీఓగా ఎం.వీరభద్రయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆళ్లపల్లి ఎంపీఓగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన తోట తులసీరాం జూలూరుపాడుకు వెళ్లారు.

రెండో విడతలో 357 మందికి గొర్రెలు

అశ్వారావుపేటరూరల్: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రెండో విడత గొర్రెల పంపిణీకి మండలంలోని 11 గొర్రెల పెంపకందారుల సొసైటీల నుంచి 357 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు మండల పశుసంవర్ధక శాఖ వైద్యురాలు ఎం.స్వప్న తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం మాట్లాడుతూ.. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన 50 మంది, ఆసుపాకలో 27, గుమ్మడవల్లి 49, జమ్మిగూడెం 13, నారంవారిగూడెం 66, నారాయణపురం 21, పాకలగూడెం 10, మామిళ్లవారిగూడెం 12, పాపిడిగూడెం 20, పేరాయిగూడెం 18, అశ్వారావుపేట 68 మంది లబ్ధిదారుల చొప్పున మంజూరైనట్లు వివరించారు.

నాణ్యమైన గొర్రెలను పంపిణీ చేయాలి

భద్రాచలంటౌన్: రెండో విడత మంజూరైన గొర్రెల యూనిట్లలో నాణ్యమైన గొర్రెలను పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు జిల్లా వెనుకబడిన తరగతుల అధికారిని ఇందిరను కోరారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో లబ్ధిదారులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గొర్రెల యూనిట్లు ఏపీలోని విశాఖపట్నం, విజయనగరం జిల్లాలో విక్రయించారన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాని ఆమె హామీ ఇచ్చారు. లబ్ధిదారులు సూరమ్మ, కృష్ణవేణి, కుసుమ, వరలక్ష్మి, నరసింహారావు, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

బాధితులకు సాయం



బాధితులకు సామగ్రి అందజేస్తున్న సభ్యులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో పకీరయ్య ఇల్లు పూర్తిగా కాలిపోగా బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వంట పాత్రలు, దుస్తులు, టార్పాలిన్, బకెట్, నిత్యావసర సరకులను శుక్రవారం అందించారు. ఈ మేరకు రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు ఎంబి.నర్సారెడ్డి, బి.వెంకటరెడ్డి, ఆదినారాయణలు ఫకీరయ్య కుటుంబానికి సామగ్రి అందించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, స్థానిక సభ్యులు విజయ, ప్రకృతమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వాటర్ కూలర్..

భద్రాచలంఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విద్యార్థుల సౌకర్యార్థం శుక్రవారం ప్రేరణ స్వచ్ఛంద సంస్థ తరఫున 200 లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ కూలర్‌ను వితరణగా అందించారు. వైద్యులు జయభారతి, కమల రాజశేఖర్, సంస్థ సభ్యులు, ఎస్టీఓ సుభద్ర, వికాస తరంగిణి సభ్యులు వెంకటాచారిలు కూలర్‌ను అందించగా ప్రారంభించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఎలాంటి అనుమతి లేకుండా సెక్యూరిటీ విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరిని కొద్దిరోజుల క్రితం గుర్తించగా, దేవస్థానం ఈఓ రమాదేవి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆస్పత్రే.. ఆఖరి మజిలీ!

పెరుగుతున్న గుర్తు తెలియని వ్యక్తుల మరణాలు

- చివరి రోజుల్లో ఆదరణకు నోచుకోని వారెందరో
- ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులకు ఇబ్బంది
- ఎవరూ రాకపోవడంతో పంచాయతీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు



భద్రాచలంలోని ఏరియా ఆస్పత్రి

భద్రాచలంఅర్బన్: పెద్దగా ఆస్తిపాస్తులు, సౌకర్యాలు లేని రోజుల్లోనే మనషుల నడుమ అనుబంధాలు, ఆప్యాయతలు చక్కగా ఉండేవి. అయితే ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. తమ చివరి మజిలీ సొంత మనుషుల మధ్య సాఫీగా సాగిపోవాలని భగవంతున్ని కోరుకుంటారు. కానీ చాలా మంది వృద్ధులు కుటుంబ ఆదరణకు దూరం అవుతున్నారు. అనారోగ్యంతో, నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులను కొందరు ఆస్పత్రుల్లో వదిలి వెళ్లిన ఘటనలు కొంత కాలంగా భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో వెలుగు చూస్తున్నాయి. దీంతో అందరూ ఉన్నా చివరి రోజుల్లో ఒంటరై అనారోగ్యంతో ఆస్పత్రిలోనే తనువు చాలిస్తున్నారు. ఏరియా ఆస్పత్రిలో ఇలాంటి ఘటనలు ఇటీవల కాలంలో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి.

ఏరియా ఆస్పత్రిలో కొంత కాలం నుంచి గుర్తు తెలియని వృద్ధులు, వ్యాధుల బారిన పడిన వ్యక్తుల మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నెలలో కనీసం ఐదారుగురు అనారోగ్యంతో ఏరియా ఆస్పత్రిలో చేరుతున్నారు. వీరిలో కొంత మందిని స్థానిక మానవ సేవ వలంటరీ ఆర్గనైజేషన్ వారి వద్దకు పంపుతున్న క్రమంలో వీరిని ఆ వృద్ధాశ్రమంలో చేర్చుకొని వీరి బాగోగులను నిర్వాహకులే చూస్తున్నారు. మరణించిన వారి వివరాలు తెలియకపోవడంతో పోలీసులతో పాటు వైద్యాధికారులు, పంచాయతీ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

కుటుంబసభ్యులే వదిలేస్తున్న వైనం..

స్వతహాగా ఆస్పత్రికి వచ్చే వృద్ధులు, అనారోగ్య బాధితులు కొందరైతే.. ఇంకొందరినేమో కుటుంబ సభ్యులే ఆస్పత్రిలో వదిలివెళ్తున్నారు. సహాయకులు లేకుంటే ఆస్పత్రి సిబ్బంది అభ్యంతరం చెబుతారు. ఈ కారణంతో కొందరు వృద్ధులను వార్డులో అడ్మిట్ చేసిన తర్వాత ఒకటి, రెండు రోజులుండి అక్కడి నుంచి పత్తా లేకుండా వెళ్లిపోతున్నారు. ఆధార్ కార్డు ఆధారంగా అడ్రస్ రాయించినా సెల్ నంబర్ తప్పుగా ఇస్తున్నారని సిబ్బంది చెబుతున్నారు. ఇలా ఆస్పత్రిలో చేరిన వారు కోలుకుంటే ఎలాగోలా వాళ్లే ఇళ్లకు వెళ్లిపోతారని, కానీ మృతి చెందితే వారి మృతదేహాలను ఒకటి, రెండు రోజుల పాటు మార్చురీలో భద్రపరుస్తామని అంటున్నారు. తగిన వివరాలు, సెల్ నంబర్ లేని కారణంగా మృతి చెందిన వారి వివరాలను కుటుంబ సభ్యులకు తెలుపలేకపోతున్నామని సిబ్బంది చెబుతున్నారు. వీరిలో వృద్ధులు, మతిస్థిమితం లేని వారి కంటే కుటుంబ సభ్యులు ఉన్న వాళ్లే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

అనాథలుగా భావించి అంత్యక్రియలు..

ఆస్పత్రి అడ్మిషన్ రిజిస్టర్లో ఉన్న వివరాల ప్రకారం మృతి చెందిన వారి వివరాలను సిబ్బంది కనుగొనే ప్రయత్నం చేస్తుంటారు. ఒక వేళ మృతి చెందిన వారు అనాథలైతే మీడియాకు సమాచారం అందించి వారి ఫొటోలను పత్రికల్లో ప్రచురిస్తారు. మృతదేహం కోసం ఎవరూ రాకుంటే భద్రాచలం పంచాయతీ సిబ్బంది సహకారంతో స్థానికంగానే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదిలో దాదాపు ఏడుగురు అనాథలుగా ఆస్పత్రిలో మరణించగా, సరైన సమయంలో వైద్యం అంది దాదాపు 8 మంది ఇంటికి వెళ్లని వారిని స్థానిక సరోజిని వృద్ధాశ్రమం నిర్వాహకులు వారిని దగ్గరకు తీసుకుంటున్నారు. అదే విధంగా వివిధ కారణాలతో మృత్యువాత పడిన పది మందికి పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు.

ఆస్పత్రిలో వదిలి వెళ్తే కేసులు



రక్త సంబంధీకులు ఎవరైనా వృద్ధులను, మతి స్థిమితం లేని వారిని ఏరియా ఆస్పత్రిలో వదిలి వెళ్తే కేసులు నమోదు చేస్తాం. ఆస్పత్రిలో కుటుంబ సభ్యులే దగ్గరుండి వారి సంరక్షణ చర్యలు చూసుకోవాలి. అలా కాకుండా ఆస్పత్రిలోని వార్డులో వదిలివెళ్లే వారి వివరాలు సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. దయచేసి అనారోగ్యంతో ఉన్న వృద్ధులను ఆదరించండి.

– పి. నాగరాజు రెడ్డి, టౌన్ సీఐ, భద్రాచలం

తప్పకుండా సంరక్షకులు ఉండాలి



అనారోగ్యంతో ఉన్న వారిని ఆస్పత్రిలో చేర్పించాలంటే వారి వెంట తప్పకుండా ఎవరో ఒకరు సహాయకులు ఉండాలి. స్వతహాగా వారి పనులు చేసుకునే వారైతే ఫర్వాలేదు. తీవ్ర అనారోగ్యంతో ఉంటే కుటుంబ సభ్యులు తోడు ఉండాలి. ఆస్పత్రిలో మృతి చెందిన వారి వివరాలు తెలియకుంటే రెండు రోజుల పాటు మృతదేహాలను మార్చురీలో భద్రపరచి తర్వాత పంచాయతీ సిబ్బందికి అప్పగిస్తున్నాం

– రామకృష్ణ, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి

కుటుంబ సభ్యులుగా భావిస్తున్నాం



ఏరియా ఆస్పత్రిలో వృద్ధులు, అనాథలకు వైద్యం అందిన తరువాత వారిని మా వృద్ధాశ్రమంలో చేర్చుకుంటున్నాం. గడిచిన డిసెంబర్ నుంచి దాదాపు ఎనిమంది వృద్ధులు, అనాథలు వృద్ధాశ్రమంలో చేరారు. తల్లిదండ్రులు, వృద్ధులపై బాధ్యతతో వ్యవహరించి, బాగోగులను చూసుకోవాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులదే.

– సరోజిని దేవి, మానవసేవ వలంటరీ ఆర్గనైజేషన్ నిర్వాహకురాలు, భద్రాచలం

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కరకగూడెం/మణుగూరురూరల్: పాల్వంచ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద భవానీ ఫంక్షన్ హాల్లో ఈ నెల 16న జరగనున్న జిల్లా పురగిరి క్షత్రియ పెరిక సంఘం జిల్లా ఆత్మీయ సమ్మేళనం, జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారంను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బరపటి ప్రసాద్, జిల్లా కార్యదర్శి పూజారి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు శుక్రవారం మండలంలోని అనంతారం, భట్టుపల్లి, కరకగూడెం, పినపాక, మణుగూరు మండలాల్లో పర్యటించి అందుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, సభ్యులు అత్తె నాగేశ్వరరావు, తిప్పని శ్రీనివాసరావు, కొమ్మ ప్రసాద్, అత్తె సత్యం, భిక్షపతి, మణుగూరు మండల అధ్యక్షులు చిట్టి మల్లేష్, బైరిశెట్టి సూర్యం, పూజారి వెంకన్న, చిట్టి శ్రీను, ముద్దం సతీష్, బిల్ల సత్యం, చిట్టి నర్సయ్య, అత్తె సారయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ మార్చాలి..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని అశోక్ నగర్ కొత్త కాలనీలో జనావాసాలపై నుంచి వెళ్తున్న 33 కేవీ విద్యుత్ లైనును వెంటనే మార్చాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 14వ వార్డు పరిధిలో జనరల్ బాడీ సమావేశం ఆకుల సుశీల అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త కాలనీలో జనావాసాలపై నుండి వెళ్తున్న లైన్ కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఈ విషయాన్ని అనేక మార్లు విద్యుత్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా లైన్ మార్పునకు చొరవ చూపడం లేదన్నారు. అనంతరం జోన్ కమిటీని 22 మందితో ఏర్పాటుచేసి, జోన్ పరిధిలోని రెండు బూత్లకు కమిటీలు ఏర్పాటు చేశారు. పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, సొసైటీ డైరెక్టర్ చాట్ల శ్రీనివాస్, రాము, పిట్టల రాజబాబు, హైమావతి, వాగ్దాన లక్ష్మీ, ఆదిలక్ష్మీ, సరోజినీ, లీల, పద్మ, ఎర్రం శెట్టి పూర్ణ పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో బడిబాట

బూర్గంపాడు: పిల్లలందరు బడిబాట పడితేనే భవిష్యత్‌కు పునాదులు పడతాయని బూర్గంపాడు బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవ్‌సింగ్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వలస ఆదివాసీ గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు రూప్లా, భాస్కర్, చంద్రయ్య, లక్ష్మయ్య, సమ్మయ్య, రామయ్య, అర్జున్ పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌కు నివాళి

మణుగూరు రూరల్ : మండలంలోని రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ చామంచుల కృష్ణ(44) అనారోగ్యంతో మృతి చెందగా పలువురు శుక్రవారం రాజీవ్‌గాంధీనగర్‌లోని ఆయన స్వగృహంలో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీటీసీ పోశం నరసింహరావు, నాయకులు అయోధ్య, లక్ష్మీకుమారి, నాగేశ్వరరావు, నవీన్, సురేష్ ఉన్నారు.

'ప్రజాగర్జన'ను జయప్రదం చేయాలి



అశ్వాపురం: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



బూర్గంపాడు: ప్రచారంలో సీపీఐ నాయకులు

అశ్వాపురం: కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఆదివారం జరిగే సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో శుక్రవారం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇస్తామన్న సీఎం కేసీఆర్ ఇప్పుడు ఆ సంఖ్యను తగ్గించారని వాస్తవ పరిస్థితులను గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, అమెర్ధ సర్పంచ్ బండ్ల సీతమ్మ, పార్టీ మండల సహాయ కార్యదర్శులు కొండపర్తి ప్రసాద్, రాయపూడి రాజేష్, పోతురాజు ముత్తయ్య, వసంత్ పాల్గొన్నారు.

బూర్గంపాడు: ప్రజాగర్జన బహిరంగ సభకు పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ముప్వా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజాగర్జన ప్రచార కార్యక్రమంలో భాగంగా మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పేరాల శ్రీనివాసరావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, బీమా, నాయుడు, సుబ్రహ్మణ్యం, రామదాసు, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

జ్వర సర్వే..



సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చర్ల: మండలంలోని సత్యనారాయణపురం, కొయ్యూరు ప్రభుత్వ వైద్యశాలల పరిధిలోని పలు గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు తీసుకున్నారు. మండలంలోని ఆర్.కొత్తగూడెం, కొత్తగట్ల, రాళ్లగూడెం, కొయ్యూరు తదితర గ్రామాలలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ దివ్యనయన పర్యవేక్షణలో ఈ సర్వే నిర్వహించారు. సర్వేలో డీపీఎంఓలు సత్యనారాయణ, ముత్యాలరావు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్స్, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మణుగూరు రూరల్: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూక్యా శంకర్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను, యూనిఫామ్‌లను సరిపడా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన అలవెన్సుల జీఓను, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర కిషన్, మండల ప్రధాన కార్యదర్శి బాణోత్ మధుకర్, ఇస్లావత్ బాలాజీ, సుధాకర్, శ్రీను పాల్గొన్నారు.

టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

దుమ్ముగూడెం: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షురాలు కారం సంధ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నారాయణపేట గ్రామంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నా హాస్టళ్లలో టీచర్ పోస్టులు భర్తీ చేయలేదని, మౌలిక సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇన్‌చార్జ్ ఎంఈఓల పాలనతో పరీక్షా ఫలితాలు తగ్గుతూ వస్తున్నాయని, అధికారులు స్పందించి పర్మినెంట్ ఎంఈఓలను నియమించాలన్నారు. డివిజన్ కన్వీనర్ మునిగేల శివ, ప్రశాంత్, రాజేష్, శశాంత్, ప్రకాష్, రవి, జయప్రకాష్, రామకృష్ణ, స్వప్న పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే దిక్సూచి



బూర్గంపాడు: కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

బూర్గంపాడు: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మిగతా రాష్ట్రాలకు, దేశానికి దిక్సూచిగా మారాయని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. సారపాక గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని 26మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదల అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను అమలు చేస్తుందన్నారు. కల్యాణలక్ష్మీ, ఆసరా పింఛన్లు, దళితబంధు, కులవృత్తులవారికి చేయూత వంటి పథకాలు పేదలకు కొండంత ఆర్థిక భరోసా నిస్తున్నాయన్నారు. అనంతరం సారపాకలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని విప్ రేగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పార్టీ పట్టణ అధ్యక్షులు కొనకంచి శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు, సొసైటీ డైరెక్టర్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రతీ ఇంటికో సంక్షేమ పథకం

దమ్మపేట: సీఎం కేసీఆర్ పాలనలో, రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి కనీసం ఒక్క సంక్షేమ పథకం అయిన చేరుతుందని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. దశాబ్ది దినోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో, సంక్షేమ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవులకు గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్యాణలక్ష్మీ, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు సోయం ప్రసాద్, దారా మల్లిఖార్జునరావు, దారా యుగంధర్, ఐదు మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, బీఆర్ఎస్ నాయకులు దొడ్డాకుల రాజేశ్వరరావు, యార్లగడ్డ బాబు, పలు శాఖల ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కులవృత్తుల వారికి చేయూత పథకం ద్వారా లబ్ధిపొందిన వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అధికారిని ఇందిర సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం జరిగిన తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలకు ఆమె ప్రత్యేక అధికారిగా మాట్లాడారు. ముందుగా భద్రాచలం డివిజన్‌లో కులవృత్తుల వారికి చేయూత పథకం ద్వారా 10 మంది లబ్ధిదారులతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఆమె చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి.నాగలక్ష్మి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామకృష్ణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.



దమ్మపేట: గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



భద్రాచలంటౌన్: లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న డీడబ్ల్యూఓ ఇందిర

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి



భద్రాచలంటౌన్: మాట్లాడుతున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడిపి ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించాలని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. తెలంగాణ ఆర్టీసీ సంస్థ నూతనంగా అమలులోకి తీసుకొచ్చి విలేజ్ బస్సు ఆఫీసర్స్ సేవలకు ఆయన భద్రాచలం బస్టాండ్ ఆవరణలో ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేజ్ బస్సు ఆఫీసర్లు విధులలో వినియోగించే కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ బి.రామారావు, అసిస్టెంట్ మేనేజర్ వి.గౌతమి, సాహితి, నరసింహారావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు రూరల్: టీఎస్ఆర్టీసీ చేపట్టిన విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మణుగూరు మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు అన్నారు. మణుగూరులోని సురక్షాబస్టాండ్‌లో డిపో మేనేజర్ స్వామి ఆధ్వర్యంలో కమిషనర్ విలేజ్ బస్ ఆఫీసర్లకు యూనిఫాంలు, బ్యాగులు, పెన్నులు పంపిణీ చేశారు. మణుగూరు డిపో ఆధ్వర్యంలో ఎనిమిది మంది విలేజ్ బస్ ఆఫీసర్లను నియమించినట్లు, వారికి వారి పరిధి గ్రామాలను కేటాయించినట్లు డిపో మేనేజర్ స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కనకదుర్గ, జూనియర్ అసిస్టెంట్ నరసింహ, కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బి.సైదులు, సేఫ్టి వార్డెన్ లూర్దయ, డీఏ పీవీ.రెడ్డి, సిబ్బంది జీఎస్ రావు, నారాయణ, రాంబాబు, నరేందర్, విలేజ్ బస్ ఆఫీసర్లు కృష్ణ చారి, సుధాకర్, వైఎస్ రావు, ఉపేందర్, పూర్ణచందర్ పాల్గొన్నారు.



మణుగూరు రూరల్: యూనిఫాంలు అందజేస్తున్న కమిషనర్ ఉమామహేశ్వరరావు

నకిలీ విత్తనాలను అరికట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చంద్రుగొండ: నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం మండలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యవసాయశాఖ అధికారికి వినతిపత్రం అందించారు. చంద్రుగొండలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, పురుగు మందులు షాపుల్లో ధరల పట్టిక అందుబాటు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా మండలకేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన సెంట్రల్‌లైటింగ్ నెలల తరబడి వెలగడం లేదని వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో ఎంపీఓ ఎం.వీరభద్రయ్యకు వినతి అందించారు. సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు పెద్దిని వేణు, రాయి రాజా, వెంకటేశ్వర్లు, తిరుమలరావు, కృష్ణయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనుల పరిశీలన

కరకగూడెం: మండలంలోని భట్టుపల్లి పంచాయతీ పరిధిలో జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నామని, మౌలిక వసతులు కావాల్సిన అన్ని నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి చేస్తున్నామన్నారు.

18న ఆన్‌లైన్ క్విజ్ పోటీలు



అన్నపురెడ్డిపల్లి: ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, నాయకులు

అన్నపురెడ్డిపల్లి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించే రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలో యువత పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంకమ్మ తల్లి ఆలయంలో పోటీల ప్రచార వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ నెల 17 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భీముడు, చెరుకూరి రవి, దోసపాటి రాంబాబు, ఇనపనూరి రాంబాబు, చల్లా రమేష్, యాదాల వెంకన్న, పుల్లయ్య, నాగరాజు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలపై విస్తృతంగా ప్రచారం చేయాలని కాంగ్రెస్ పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ ఎల్‌డీఎం (లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్) ఇన్‌చార్జ్ ఏనుగుల అర్జున్‌రావు కోరారు. మండలంలోని ఆసుపాక గ్రామంలో శుక్రవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పోటీల్లో 7661899899 నంబరు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోని, ఆన్‌లైన్ పరీక్షకు హాజరు కావాలన్నారు. ఈ పరీక్ష ఈ నెల 18న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యురాలు, జెడ్పీటీసీ సున్నం నాగమణి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు ముష్టిన శిరీష, నాయకులు తుమ్మా రాంబాబు, కొప్పుల శ్రీను, దుర్గారావు, ఉప్పల రాజశేఖర్, ఎస్‌కే బాబు, కక్కిరాల నరేష్, సోడే రాజేష్ పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: పోస్టర్లు ఆవిష్కరిస్తూ..